క్లుప్తంగా

శరత్‌బాబు మృతికి సంతాపం

టెక్కలి: ప్రముఖ సినీ నటుడు శరత్‌బాబు మృతికి పట్టణానికి చెందిన సుదర్శన్ థియేటర్ యాజమాని సత్తారు వెంకటరమణ, మేనేజర్ ఎస్.బాలకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సినీ ప్రపంచంలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిన శరత్‌బాబు మృతి సినీ లోకానికి తీరని లోటన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: మండపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరమ్మతులు చేపడుతున్నందున పలు గ్రామాలకు మంగళవారం సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఏఈ గోవిందరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. మండపల్లి పంచాయతీ పరిధిలో బాలకృష్ణాపురం, మశాఖపురం గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేషన్ సరకులు అందలేదని ఫిర్యాదు


తహసీల్దార్ హైమావతికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కంచిలి: రెండు నెలలుగా రేషన్ సరకులు తమకు అందలేదని బొగాబెణి పంచాయతీ పరిధి కుమ్మరిపేట గ్రామానికి చెందిన పలు కుటుంబాలు, సర్పంచ్ సింహాచలం తహసీల్దార్ ఎస్.హైమావతి సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డిని కూడా కలిసి తమ సమస్యను విన్నవించారు. దీనిపై తహసీల్దార్ స్పందించి సమస్యపై విచారణ చేసి అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రవేశాలు పదో తరగతిలో మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. జూన్ ఏడో తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 150 రూపాయలను దరఖాస్తు రుసుముగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి:కలెక్టర్


తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: స్పందన కార్యక్రమంలో శాఖల వారీగా వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం నుంచి సోమవారం నిర్వహించిన జూమ్ మీటింగ్ ద్వారా ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లోని సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఒక్క వినతి కూడా పెండింగ్‌లో ఉండకూడదని ఆదేశించారు. ఎంపీడీవో కె.రామారావు, తహసీల్దార్ ఎస్.గురుమూర్తి, ఎంఈవో కురమాన అప్పారావు, మండల ఇంజినీరింగ్ అధికారి భగీరథ దొళాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోకులపాడులో పారిశుద్ధ్య పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో సర్పంచ్ వడ్డి సరిత, ఎంపీటీసీ సభ్యురాలు కొయిరి భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పలు కూడళ్లు, గోర్జీలు, రోడ్డు పక్కన, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని యంత్రాల సహాయంతో తొలిగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డి కరుణకర్, కొయిరి ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

పందుల మృతితో కలకలం

టెక్కలి రూరల్: టెక్కలి పరిసర ప్రాంతంలో పందులు అంతుచిక్కని సమస్యతో మృత్యువాత పడుతున్నాయి. వారం రోజుల వ్యవధిలో సుమారు 80 పందులు మృతి చెందడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి జబ్బు లక్షణాలు కన్పించడంలేదని, ఎండ తీవ్రతకు మృతిచెందుతున్నాయా.. లేక మరేదైనా సమస్యతో చనిపోతున్నాయా అనేది తెలియడం లేదని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో పందులే జీవనాధారంగా సుమారు 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన

సోంపేట: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బారువ శాఖా గ్రంథాలయాధికారి ధర్మారావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

స్వచ్ఛంద సేవకులకు సన్మానం


కవిటి: బల్లిపుట్టుగలో గ్రామ వలంటీర్లను సత్కరించిన సాయిరాజ్

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన గ్రామవలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని టెక్కలి మండలం గూడేం, శాసనాం పంచాయతీ సర్పంచ్‌లు పి.సంతోషమ్మ, ఎస్.అప్పలస్వామి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గూడేం గ్రామ సచివాలయం పరిధిలోని పలువురు వలంటీర్లను సోమవారం సన్మానం చేశారు. పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సుధాకర్, బుసకల శ్రీను, రామయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు విలువ కట్టలేనివి

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ ఎంతో ఉన్నతమైనదని, వారి నిస్వార్థ సేవలు విలువ కట్టలేనివని వార్డు కౌన్సిలర్లు పిలక ఈశ్వరి, నీలాపు లక్ష్మి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14, 15 వార్డు సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నీలాపు ఢిల్లి, పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..

ఉత్తమ సేవలందించండి: సాయిరాజ్

కవిటి: గ్రామ వలంటీర్లు ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలందించాలని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. బల్లిపుట్టుగ గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యపురం, బల్లిపుట్టుగ సచివాలయాల్లో సర్పంచ్ లలితాసాహూ, పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్ సాహు ఆధ్వర్యంలో వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, రజనీకుమార్‌దొళాయి, వజ్జ ప్రసాదరావు, మార్పు వెంకటేష్ పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు

సోంపేట: వలంటీర్లు సంక్షేమ సారథులని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట 1, 2, 3 సచివాలయ పరిధిలోని వలంటీర్లు, ఇస్కలపాలెం సచివాలయ పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోంపేటలో వలంటీర్లను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల వద్దకే వెళ్లి ప్రభుత్వం పథకాలను చేరువ చేయడం అభినందనీయమన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, పంచాయతీ ఈవో వరప్రసాద్, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఇస్కలపాలెం పంచాయతీ కార్యదర్శి సునీల్, వైస్ ఎంపీపీ రేగు ప్రేమ, ఎంపీటీసీ సభ్యుడు పాడుగు కామేష్, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ, పార్టీ నాయకులు, పంచాయతీ పాలవకవర్గ సభ్యులు పాల్గొన్నారు.


కవిటి: మాణిక్యపురంలో సత్కారం పొందిన వలంటీర్లతో పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్ సాహూ తదితరులు


కాశీబుగ్గ: వలంటీర్ తుంట రాఘవరావును సేవా వజ్రా అవార్డుతో సత్కరిస్తున్న చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: మున్సిపాలిటీలోని చినబడాం సచివాలయం పరిధి ఆరు, ఏడు వార్డులకు చెందిన వార్డు వలంటీర్లను మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు సత్కరించారు. వలంటీర్ తుంట రాఘవరావుకు సేవా వజ్ర పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రోణంకి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ ఏడో వార్డు ఇన్‌చార్జి దువ్వాడ రమణయ్య, డిక్కల నిరంజన్ పాల్గొన్నారు.


టెక్కలి: వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం


ఇచ్ఛాపురం: పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో నాయకులు


సోంపేట: వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు

అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి


వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం ఇస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాల కోసం దళారీలను ఆశ్రయించడం, కొనుగోలు, అమ్మకాలు చేయడం చేస్తే అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి 30 వినతులు స్వీకరించారు. అలాగే ఇంటి స్థలాల కోసం వచ్చిన లబ్ధిదారుల నుంచి ప్రత్యేకంగా వినతులు అందుకున్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఎటువంటి ఇంటి పట్టాలు లేకుండా స్థలాలు ఉన్నవారిని గుర్తించి వారిపై చర్యలు చేపడతామన్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో సొంత ఇంటి స్థలాలు ఉండి జగనన్న కాలనీల్లో స్థలాలు ఉంటే అటువంటి వారిని గుర్తించి క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పట్టణంలో తోపుడు బళ్లతో వ్యాపారాలు చేసుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని పలువురు సబ్ కలెక్టర్‌ను కోరారు. ఎన్‌టీఆర్ కాలనీలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా కుళాయిలు వేయాలని కాలనీ వాసులు విన్నవించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు పూర్తి


మాట్లాడుతున్న తిలక్

నందిగాం: మండలంలోని పలు పాఠశాలల్లో చేపడుతున్న మనబడి 'నాడు-నేడు' పథకం పనులను త్వరగా పూర్తి చేయాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన నాడు-నేడు పనుల ప్రగతిపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల అదనపు గదుల నిర్మాణం, పాఠశాలల్లో పది రకాలు మౌలిక సదుపాయాల పనులు త్వరగా పూర్తి చేసి పథకం లక్ష్యం నెరవేర్చాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సిబ్బంది, విద్యాకమిటీ చైర్మన్లు సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి, మండల విద్యాశాఖాధికారి జి.నర్సింహులు, నాడు-నేడు ఇంజినీరింగ్ అధికారి బెనర్జీ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు, ఏపీఎం నీలవేణి, సర్లాన బైరాగి, మళ్ల సీతారాం, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


బహుమతులతో విద్యార్థులు

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని ఎంఈవో ధనంజయమజ్జి అన్నారు. బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. 550 మార్కులు పైబడి సాధించిన తొమ్మిది మందితో పాటు 500 మార్కులకు పైగా సాధించిన 15 మందికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్, మండల రైతుఉత్పత్తిదారుల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్, హెచ్‌ఎం సనపల రామకృష్ణ, విశ్రాంత ఆర్మీ ఏఎస్‌ఐ బల్లెడ విజయప్రసాద్, డొంకాన కృష్ణారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

మందస: మహిళలు సంఘటితంగా ముందుకు సాగితే జీవనోపాధులు మెరుగుపడతాయని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మందసలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సిబ్బందితో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. నిరుపేద డ్వాక్రా మహిళలను సంఘటితం చేసి, వారి స్థితిగతులు పెంపొందించడానికి ప్రభుత్వం పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వారి ఆర్థికాభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల గ్రేడింగ్, ఫైనాన్షియల్ లిటరసీ, రికవరీలను శతశాతం చేయాలని సీసీ, వీఓఏలను ఆదేశించారు. ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న పథకాలతో పాటు వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా స్వయంశక్తి సంఘాలు బలోపేతానికి స్కీంలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సవర కాంతమ్మ, కోశాధికారి బాలక విజయశ్రీ, సీసీలు చిచ్చుల కిషోర్‌కుమార్, తేజ, కల్యాణి పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లిలో పంచాయతీ నిధులు సుమారు రూ. 3 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ లండ లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగం సోమవారం శంకుస్థాపన చేశారు. ఇప్పటికే రూ. 20 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వార్డు సభ్యులు లండ ధనరాజు, పి.ధనరాజ్, కుమారి,హేమలత ఉన్నారు.

25న జగనన్న ఆణిముత్యాలు ప్రదానం


మాట్లాడుతున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: ఈ ఏడాది టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్టు ఎంఈవో కురమాన అప్పారావు తెలిపారు. సీఆర్పీలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 25న స్థానిక పురుషోత్తపురం మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో మంచి మార్కులు సాధించిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేసి.. దుశ్శాలువలతో సత్కరిస్తామన్నారు.

ఎంపికైన విద్యార్థులు

పదో తరగతికి సంబంధించి కొంతాల విద్యారెడ్డి(ఇచ్ఛాపురం), పిట్ట ప్రమీళ (కవిటి), కంచిలి మండలానికి సంబంధించి గేదెల నందిని, గుజ్జు ధనలక్ష్మి, శృతి బెహరా, పైలా చాందిని, బోనెల హరిబాబులు బహుమతులకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో బచ్చు నందిని (ఏపీఎంఎస్ జేసీ-ఇచ్ఛాపురం), దుర్గాశి వనజ(జీజేసీ-ఇచ్ఛాపురం), ఆట్ల అమృత (ఏపీఎంఎస్-సోంపేట), పి.నవీన్ (జీజేసీ-బారువ) ఉన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోర్స్ డైరెక్టర్ వై.చిన్నమనాయుడు అన్నారు. 1998, 2008, 2018 డీఎస్సీకి చెందిన పలాస డివిజన్ ఉపాధ్యాయులకు రెండో విడత శిక్షణ తరగతులు కాశీబుగ్గ జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. అందుకు ఈ వృత్యంతర శిక్షణ దోహదపడుతోందన్నారు. ఐదు రోజులు జరిగే శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలన్నారు. కోర్స్ సమన్వయకర్త ఎస్.సూర్యప్రకాష్, డైట్ అధ్యాపకుడు బలివాడ సతీష్‌లు తరగతి గదిలో ఎలా బోధన చేయాలో వివరించారు. రాష్ట్ర రిసోర్స్‌పర్సన్లు ఎల్.వెంకటాచలం, ఆర్.వి.రమణమూర్తి, షణ్ముఖరావు, ముఖలింగం, పట్నాయక్, జి.వాణికుమారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- చినంచలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- సచివాలయ భవనం ప్రారంభం


మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస: గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికే ప్రభుత్వం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పారు. చినంచల పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంత్రికి తొలుత గ్రామ ప్రజలు మంగళ వాయిద్యాలతో ఎదురెళ్లి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ఉన్నటుంటి శివాలయానికి వెళ్లి శివున్ని దర్శించుకున్నారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఆ తర్వాత ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని వారికి తగిన సలహాలు సూచనలు చేస్తూ వారికి కూడా అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. చినంచలకు రూ.4.60 లక్షలతో రోడ్డు, వీరరామచంద్రాపురం గ్రామానికి రూ.5.30 లక్షలతో రోడ్డు, రూ.3 లక్షలతో సామూహిక మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. గోదావరిపురం గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేపడతామని చెప్పారు. చినంచల, గోదావరిపురం, వీరరామచంద్రపురం గ్రామాల్లోని 647 ఇళ్లను సందర్శించారు. సర్పంచ్ కంచరాన సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ, తహసీల్దార్ మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టి, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.సుధాకర్, నాయకులు మచ్చ ధనరాజు, ఎం.ఎస్.మూర్తి, కొర్ల సంతోష్, కంచరాన భాస్కరరావు, మాజీ ఎం.పి.టి.సి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో సంక్షేమాభివృద్ధి

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- పెద్ద హరిశ్చంద్రపురంలో సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: సచివాలయాలు సంక్షేమాభివృద్ధికి వారధులుగా నిలుస్తున్నాయన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సచివాలయాల ద్వారానే గ్రామ స్వరాజ్యపాలన జరుగుతోందన్నారు. పెద్ద హరిశ్చంద్రపురం గ్రామంలో రూ. 46 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటబొమ్మాళి మండలంలోని 27 గ్రామాల్లో ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ. 40 లక్షల చొప్పున నిధులను ప్రభుత కేటాయించిందన్నారు. ప్రస్తుతం నిర్మాణాలన్నీ చివరి దశలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే అన్ని భవనాలను ప్రారంభిస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డు, పింఛన్, ఇళ్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు కావాలంటే జన్మభూమి, మండల కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలించి మంజూరు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో సచివాలయాలు పురుడు పోసుకున్నాయన్నారు. వీటి ద్వారా సామాన్యులు కూడా వారికి అవసరమైన పనులను సులభంగా చేయించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, జిల్లా అగ్రికల్చరల్ అడ్వైజరీ బోర్డు సభ్యుడు కవిటి రామరాజు, సర్పంచ్‌లు గురువెల్లి కేశవరావు, నూక సత్యరాజ్, సుంకరి జనార్దన, ఎస్.వి.రమణ, బొడ్డు వెంకటరమణ, లఖినేని సూర్యకాంతం, కాల్ల సంజీవరావు, బోయిన కృష్ణారావు, బమ్మిడి శ్రీనివాస్, మెండ నర్సింహారావు, ఎంపీటీసీ సభ్యులు బగాది దివాకర్, పూజారి సత్యం, దుక్క రామక్రిష్ణ పాల్గొన్నారు.

రెండు దశాబ్దాల తరువాత ఒకే వేదికపై..


టెక్కలి: ఆత్మీయకలయికలో పోలవరం పాఠశాల పూర్వవిద్యార్థులు


కంచిలి: ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కంచిలి: కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తరువాత సోమవారం కలుసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాల ఆవరణే వేదికైంది. విద్య నేర్పిన గురువులను మెయిన్ రోడ్డు నుంచి మేళ తాళాలతో ఊరేగింపుగా తోడ్కొని వచ్చి వేదిక వద్ద దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. రోజంతా పూర్వ విద్యార్థులంతా తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు.

టెక్కలి: పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు కె.అజయ్‌కుమార్, శివప్రసాద్, వాసు ఆధ్వర్యంలో అప్పటి ఉపాధ్యాయులు చిన్నారావు, రుక్మిణి, కొండమ్మ, ఉదయ్, రాజేష్‌లను సన్మానించారు.

వంశధార కాలువ గట్టు ఎత్తు పెంచాలని వినతి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: వంశధార ఎడమ కాలువ ఎత్తును నాలుగు అడుగులు పెంచాలని రైతు సంఘం జిల్లా నాయకులు బి.రామకృష్ణ, కె.బాలరాజు కోరారు. శివారు ఆయకట్టుకు సాగు నీరు రావాలంటే గట్టు ఎత్తును బ్యారేజ్ నుంచి నందిగాం వరకు పెంచాల్సి ఉందన్నారు. ఈ మేరకు పలాస ఆర్డీవో సీతారామ్మూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. శివారు భూములకు నీరు రావాలంటే 2400 క్యూసెక్కులు అవసరం ఉందన్నారు. అయితే 1300 క్యూసెక్కులకే గండ్లు పడుతున్నాయని ఆర్డీవోకు వివరించారు. దీన్ని అధిగమించేందుకు కాలువలో పూడికతీతతో పాటు గట్టు ఎత్తు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సంఘ ప్రతినిధులు ఎస్.మోహన్‌రావు, ఎస్.చంద్రయ్య, బి.ఆనందరావు ఉన్నారు.